రచన:

# అర్థంకాని హృదయం

శ్రీ వై. వెంకటబలరాం.

************************************************

(గతసంచిక తరువాయి)

నా కంతవరకు భారతి ఇంత చనువుగా ఉంటుందని నాకు తెలీదు.

మేమలా మాట్లాడుకొంటు గేటు వరకు వెళ్ళాము. "ఇదుగోనండి, ఈ రెండు నోట్సులు ముందు తీసుకోండి అన్నీ ఒకసారి ఎలాగునా వ్రాయలేరు. మిగతావి రేపు ఇస్తాను" అన్నాను.

"అలాగేనండి ... థ్యాంక్స ... అడిగిన వెంటనే యిచ్చారు" అంది.

తర్వాత భారతి యింటిదారిపట్టింది.

నేను హాస్టల్ బస్సుకొరకు వెళ్ళిపోయాను.

భారతితో కలిసి మాట్లాడే సమయాలలో చాలామంది మిత్రులు చూసేవారు కాలేజీలో. "ఏమిటి కాలేజిబ్యూటీ మేమెంత పలకరిద్దామన్నా మాట్లాడనిది నీతో స్నేహం చేస్తుందంటే ఏదో వింతే మరి" అనేవారు నా మిత్రులు.

కొందరు వాడే ఆమెతో స్నేహము చేస్తున్నాడేమో అనేవారు. ఏమయితేనేం మన ప్రభాకర్ చాలా అదృష్టవంతుడు, కాలేజి బ్యూటీనే పట్టాడు.

ఇలాంటిమాటలు వినేటప్పుడు నాకు చాలా కోపము వచ్చేది. నిజానికి అది కోపమనేకన్నా భారతికి తెలిస్తే బాధపడతాదేమోనన్న భయమనే చెప్పాలి.

నా దగ్గరి మిత్రులు అడిగితే ఒట్టి స్నేహము తప్ప మరేమీ కాదని చెప్పేవాడిని. కానీ, నాకు తెలీకుండానే భారతిపై ఆశలు చిగురించేవి. భారతిని మరుచటి రోజు మళ్ళీ ఎంత వేగముగా చూస్తానా అని తాపత్రయ పడే వాడిని.

*   *   *

"మీ దయవల్ల ఈ వారంరోజులలో నోట్సులన్నీ వ్రాయగలిగాను. నావలన మీకు చాలా యిబ్బంది కలిగించివుంటే మన్నించండి" అంది నా పుస్తకాలిచ్చేస్తూ.

"అబ్బే! నాకేమీ ఇబ్బంది కలగలేదండి. అయినా ఫ్రెండ్స ఒకరికొకరు సాయము చేసుకోవడము ఇబ్బంది అనుకుంటే ఎలా చెప్పండి."

"థ్యాంక్స...అండి. మీ రైటింగ్ చాలా బాగుంది. అందుకే త్వరలో పూర్తి చెయగలిగాను.

ఇలా రోజు మాట్లాడుకోవడము వలన మేమిద్దరము బాగా స్నేహితులమయ్యాము. 'అండి' అనే దూరము నుండి 'భారతి' 'ప్రభాకర్' అనే దగ్గరకు జరిగి పోయాము.

"గుడ్ మార్నింగ్ ప్రభాకర్" ప్రొద్దున్నే వార్డులో అడుగు పెడుతుండగానే వినిపించింది భారతి కంఠము.

"గుడ్ మార్నింగ్ భారతి! ఇవాళ నాకన్నా ముందే వచ్చేసేరే" అన్నాను.

"అవును. చీఫ్ వచ్చేసరికి నిన్నటి కేసు ఎగ్జామ్ చేసివుంచమని చెప్పారుగా, మర్చిపోయారా ఏమిటి? అందుకని నేను త్వరగా వచ్చి కూర్చుంటే ఎవ్వరూ రాలేదు. మరో పార్ట్నర్ లేనిదే కేసు తీసుకోలేక ఇక్కడే వుండిపోయాను. మీరన్నా వచ్చారు, మిగతా వాళ్ళకు ఇంకా తెల్లవారలేదేమో!"

"అయితే యింకా ఎవరూ రాలేదన్నమాట. నేనే ఆలస్యమేమో అనుకుంటున్నాను పదండి కేసు తీసుకుందాము."

ఇద్దరము కలిసి మూడవనెంబరు బెడ్ దగ్గరకు వెళ్ళాం. ఆ బెడ్ మీద పేషంటుకు దగ్గర అరవై సంవత్సరము లుండవచ్చును. నెరసిన గడ్డము, చిందర వందరగావున్న జుట్టు ఎముకలు గూడు కనిపించే శరీరము, కళ్ళల్లో ప్రాణాలతో వున్నట్టున్నాడు. పేషంటు కాస్త ఆయాస పడుతూ, దగ్గుతూ, మమ్మల్ని చూడగానే నవ్వుతూ అన్నాడు, "మీకు కూడా ముందునుంచి అన్ని వివరాలు చెప్పాలా బాబు. ఈ హాస్పిటల్‌కు వచ్చిన దగ్గరనుండి ప్రతిరోజూ మీలాంటి బాబులకు నా జబ్బుగురించి చెప్పుకోవడంతోనే సరిపోతుంది. ఈ నా జబ్బుమాత్రం బాగు పడడములేదు" అన్నాడు విసుగ్గా.

నేను కాస్త ఓదారుస్తూ "అలాగంటే ఎలాగండి, మీ బాధ చెప్పుకోవడమువలన మీకు మనస్సులో ఆరాటము కొంత తగ్గవచ్చు. మాకు ఏ రోగానికి ఏ మందు లిస్తే తగ్గుతుందో తెలుస్తుంది" అన్నాను.

"రోజూ నాకిది అలవాటు అయిపోయింది. కానివ్వండి మీ పనేమిటో, ఇక్కడున్నన్నాళ్లు నాకు తప్పేట్టులేదు" అన్నాడు కాస్త చిరాకుగా.

"పేషంటును మీరడగండి, కంప్లైంట్ గురించి నేను వ్రాస్తాను" అంది భారతి.

"అలాగేనని పేషంట్ కంప్లైట్ గురించి నేను వివరములు అడగడము భారతి కేస్‌షీటు పద్ధతిలో వ్రాస

కములో వ్రాస్తూ ఇద్దరము కలసి పేషంట్‌ను పరీక్షిస్తుండగా మిగతా మిత్రులంతా వచ్చారు. అప్పుడే అందులో కొందరు కాలేజి కేంటీన్‌కు వెళ్ళివస్తున్నారు.

"అప్పుడే కేస్ షీటు వ్రాయడము అయిపోయిందా?" మా మిత్రులలో ఒకరు ప్రశ్నించారు.

"ఆఁ, అయిపోయి అరగంటయ్యింది" అన్నాను వాళ్ళ ఆలస్యాన్ని ఎత్తిపొడుస్తూ.

"అయితే, డాక్టరుగారి డయాగ్నొయిస్ ఏమిటో?" అన్నాడు మరొకడు వెటకారంగా.

అప్పటికి భారతిమాత్రమే ఆస్కల్టేషన్ (స్టెత్‌తో పరీక్షించుట) చేస్తుంది. నేనింకా ఆస్కల్టేషన్ చేయలేదు. అయినా తెలీదని ఎందుకు చెప్పాలని ఇది "బ్రోంకైలు ఆస్త్మాకేస్' అన్నాను.

అందరూ నవ్వారు భారతి తప్ప. తను ఆస్కల్టేషన్ చేయడము అయిపోయినట్టుంది. విచిత్రముగా నా ప్రక్క చూస్తూ,

"నిజమేనండి, ఇది బ్రాంకైల్ ఆస్మాకేస్‌లాగే ఉంది అంది."

ఇప్పుడు ఆశ్చర్యపోవడము నావంతయింది. వెంటనే స్టెత్ తీసి పేషంట్‌ని పరీక్షించా. బ్రోంకైలు ఆస్మాకేస్ లాగే ఉందనిపించింది. రిపోర్ట్‌లో అలానే వ్రాసింది భారతి.

ఇంతలో చీఫ్ మేమున్న బెడ్ దగ్గరకు వచ్చారు. మా అందరి ప్రక్క చూసి "ఈ కేస్‌ను అందరూ పరీక్షించారా?" అన్నారు.

అందరూ తలూపేరు.

తరువాత కేసుగురించి అడుగుతూ బోధపరుస్తూ ప్రశ్నలడగసాగారు.

మిగతావాళ్ళు కేసుగురించి పూర్తిగా తెలియక పోవడంవలన తబ్బిబ్బయ్యారు. కొందరు మౌనంగా తలలు దించుకున్నారు నేను భారతి తప్ప.

అప్పుడు చీఫ్ అందరినీ ఉద్దేశిస్తూ "యూ షుడ్ షో సమ్ ఇంటరెస్ట్ అండ్ పుడ్ సమ్ ఎఫర్ట్ టునో ఎబౌటుది కేసెస్" అంటూ "దీజ్ టు ఆర్ సమ్ వాట్ బెటర్ ఇన్ దిస్ బేచ్" అంటూ ఆ రోజు క్లాస్ ముగించేరు.

నేను భారతి ఒకరి ముఖాలొకరము చూసుకున్నాం. మిగిలినవారంతా విసవిసలాడుతూ వెళ్ళిపోయారు. మా బృందములో రాఘవరావనే అతను మాత్రము నా ప్రక్క కోపముగా చూసి తొందరగా వెళ్ళిపోయాడు.

నేను భారతి కలిసి నడుస్తున్నాము.

"నాది చిన్న సందేహము" అంది భారతి.

"ఏమిటి? మళ్ళీ కేస్ గురించా?" అన్నాను కాస్త భయంగా.

"మరేమి లేదు, మీరు పేషంట్‌ను పూర్తిగా పరీక్షించకుండా బ్రోనికల్ ఆస్మా అని ఎలా చెప్పేయగలిగారు" అంది.

"ఓస్...అదా!"

"నేను పేషంట్‌ను కొంత పరీక్షించాక అది ఆస్మా కేస్ అని అనుమానించాను. మన మిత్రబృందము వెటకారముగా అడిగిన ప్రశ్నకు మౌనముగా వుండిపోవడము ఇష్టము లేక మనస్సులో ఊహించినదానిని చెప్పేను. కాని మీరు బ్రానికల్ ఆస్మా అనగానే నేనే ఆశ్చర్యపోయాను" అన్నాను

"అయితే, మీరు పేషెంటును చూడగానే ఊహించేస్తారన్న మాట రోగాన్ని. అయితే నాకు పార్ట్నర్ దొరికారు" అంది.

"నాలో ఏముంది లెండి. ఇదంతా నా పార్ట్నర్ షిప్‌లోనే వుంది" అన్నాను భారతిని ఇంకాస్త సన్నిహితము చేసుకోవాలన్న తలంపుతో.

నవ్వుతూ అంది. "అయితే రేపటినుండి కాస్త త్వరగా రాకూడదు. ఇద్దరము కలిసి కేస్ షీట్స్ వ్రాయవచ్చుగా" అని.

థాంక్ గాడ్ అనుకున్నాను మనస్సులో పైకి మాత్రము "తప్పకుండా వస్తాను" అన్నాను.

ఇంతలో హాస్పిటల్ గేటు రాడము ఇద్దరము విడిపోవడము జరిగింది.

రోజు హాస్పిటల్‌కి వెళ్ళేసరికి భారతి నా కన్నా ముందుగా వచ్చి ఎదురుచూస్తుండేది. ఒకరినొకరము విష్ చేసుకున్నాక కేస్‌లు చూపిస్తుండే వాళ్ళం. రోజు కలుస్తూ మాట్లాడుతున్నందువల్ల మేము మరింత సన్నిహితుల మయ్యాము. మాలో నువ్వు అన్నంత చనువేర్పడింది, ఆ చనువు సినిమాలు, షికార్లు వరకు దారితీసింది.

మా థియరీ క్లాసెస్ హాస్పిటల్ కెదురుగా క్రొత్తగ కట్టిన బిల్డింగ్‌లో మేడమీద గాలిలో జరుగుతుండేవి. ఒక రోజు నేను థియరీ క్లాస్‌కని మేడమెట్లు యెక్కుతున్నాను. నా ముందు భారతి, ప్రియంవద కబుర్లు చెప్పుకుంటు మెట్లెక్కుతున్నారు. భారతి హైహీల్స్ స్లిప్పయినట్టుంది. కెవ్వున అరచి క్రింద పడబోయింది. వెనుకనే వున్న నేను ఒడుపుగా పట్టుకుని, నిలబెట్టేను. భారతి కలవరపడి, నిలద్రొక్కుకుంది. అప్పుడే మెట్లెక్కబోతున్న కొందరు నవ్వబోయారు, కాని నవ్వలేదు.

భారతి నన్ను చూసి "సమయానికి పట్టుకున్నారు. లేకపోతే కాలిరిగి వుండేది."

స్థాపితం: 1960 ఫోన్: 21098

బనియన్ల తయారింపులో మా ప్రత్యేక తయారింపులు:

- గాయత్రి ఫైన్ — సరైన కొలత.
- విస్పా ఫైన్ — సరైన కొలత.
- T. N. H స్పెషల్ — సరైన కొలత.
- హాంగ్ కాంగ్ — (రీసైజు)
- నైలాన్ బనియన్లు (రీసైజు)

తయారించువారు

THE NANJAPPA HOSIERIES : : TIRUPUR - 638602.

T.N.H TRADE MARK

థాంక్యూ వెరీమచ్ అన్నట్లుగా చూసింది. ఆ ప్రక్కనున్న ప్రియంవద నా ప్రక్క కాస్త వింతగా అదోలా చూసి భారతితో అంది "మెట్లమీద పడలేదుగాని అసలైంది పారేసుకున్నావు."

"ఏమిటే!"

"మనసు" నెమ్మదిగా అంది సుకన్య.

మేడమెట్లు జోరుగా ఎక్కుతున్నా నాకు ఇంక మాటలు వినబడలేదు గాని వాళ్ళేదో గుసగుసలాడుకున్నారు. తరువాత ప్రియంవద, భారతి నవ్వులు మాత్రము కాస్త గట్టిగా వినిపించేయి.

* * *

మేము మెడికల్ వార్డులో అడుగుపెట్టి రెండు నెల అయింది. మాకు రెండు నెలలకోసారి ఒక వార్డు మారాలి. అలా మారేటప్పుడు ఆ వార్డులో ఆ రెండు నెలలు కలిసి చదువుకొన్న వాళ్ళందరము చీఫ్‌ని, అసిస్టెంట్స్‌ని, స్టాఫ్‌ని పిలిచి పార్టీ చేసుకుంటాము. అలాగే మెడికల్ వార్డునుండి సర్జికల్ వార్డుకు మారాల్సిన రోజున మేమంతా కలిసి పార్టీ చేసుకుంటాము. పార్టీ అనంతరము ఫోటో ఒకటి పెట్టేరు. ఫోటో తీసేముందు ఒక వరుసలో కుర్చీలు వేసారు. మధ్య కుర్చీలో చీఫ్, ఆ ప్రక్కన అసిస్టెంట్స్, వాళ్ళకు కుడిప్రక్కగా హౌస్ సర్జన్స్, స్టాఫ్ కూర్చున్నారు. చీఫ్ ఎడమ ప్రక్కగా మా వార్డు లేడీస్ కూర్చున్నారు. చివాలున ఇంక రెండు కుర్చీలు మాత్రము మిగిలిపోయాయి వైటింగ్ రూమ్ కెళ్ళిన ప్రియంవద, భారతీలు ఇంకా రాలేదు. ఆ కుర్చీలు వెనుక నేను, నా కుడిప్రక్కన నా క్లాస్‌మెట్ రాఘవరావు, అతని ప్రక్కన మిగతావారు నిలుచున్నాము. కెమెరా మాన్ కెమెరాని సెట్ చేసుకుంటున్నాడు.

ఇంతలో ప్రియంవద, భారతీలు వచ్చి, చివాలున ప్రియంవద, ఆ ప్రక్కన భారతి కూర్చున్నారు.

కెమెరా మాన్ నల్లటి గుడ్డ కెమెరామీద పరచి కెమెరా వెనుకకు పోయి గుడ్డలో తల దూర్చాడు. రెండు నిమిషాలు పోయాక బయటకు తలపెట్టి అంతా రెడీ అన్నాడు. అప్పుడు తల త్రిప్పి చూసింది వెనుకకు భారతి వెంటనే తన కుర్చీలోనుండి లేచి ప్రియంవదను రిక్వెస్టు చేసి, కుర్చీలు మార్చారు ఇద్దరు ఇంతలో కెమెరా మాన్ ఫోటో క్లిక్ మనిపించేడు.

రెండవ రోజే ఫోటో మా చేతిలోనికి వచ్చింది. అందమైన చీరలో, అప్పుడే ఉదయిస్తున్న సూర్యునిలా దగదగ మెరసిపోతున్న ఎర్ర రాళ్ళ నెక్లెసుతో పెదవులపైన చిరునవ్వు నాట్యము చేస్తుండగా ఠీవిగా కూర్చున్న భారతి, తన వెనుక సీటులో వున్న నేను మాత్రమే ఆ ఫోటోలో ఉన్నట్టు కనిపించింది నాకు.

మా మిత్రబృందమంతా ఫోటో చుట్టుచేరి చక్కగా వుంది జంట. అనడం మొదలుపెట్టేరు. నాలో నేనెంతగానో మురిసిపోయాను. ఫోటో బాగ పడింది అన్నాను భారతితో.

"అవును. నాకు నచ్చింది" అంది భారతి.

తర్వాత భారతి నేను కలిసి ఫోటోను నెమ్మదిగా ఒక్కొక్కరిని పరీక్షిస్తూ చూసేము. భారతి నా ప్రక్కన ఫోటోలో నించున్న రాఘవరావును చూపించి నవ్వింది. అప్పుడే గమనించేను. రాఘవరావు మొహం చిన్నబోయి వుంది. అది చూసి నవ్వుకొని అన్నాను. "రాఘవరావు సహజంగా అందగాడే" అని. భారతి క్రింద పెదవి విరిచి తల అడ్డంగా త్రిప్పింది.

* * *

ఎప్పుడు వార్డులో అడుగుపెట్టగానే వినిపించే గుడ్

మార్నింగ్ అనే పిలుపు వినబడలేదా రోజు. బహుశా ఆ రోజు ఆలస్యముగా వస్తుందేమోనన్న ఆశతో ఎదురు చూసేను. కాని ఆమె రాలేదు. వార్డులోని మిత్రులు ఏమిటి విశేషము మీ వార్డు రాలేదే? అనో, మీ శ్రీమతిని ఇవాళ తేలేదా! అనో (కాస్త ఎక్కువ పరిచయమున్న వారు) ఇవాళ క్యాజువల్ లీవ్ ఏమిటి? అని వెటకారంచేసి యక్ష ప్రశ్నలు వేసేరు. మనసులో ఏదో బాధ నాకే తెలియలేదు. వార్డులో క్లాస్‌కు వెళ్ళేనే కాని సబ్జక్టుమీద నా మనసు పోలేదు. భారతి ఎందువల్ల రాలేదోనన్న ఆలోచన తప్ప. పోనీ మధ్యాహ్నము థియరీ క్లాస్‌లోనన్నా కన్పిస్తుందేమోనని ఎదురు చూసేను. మనస్సు పరిపరి విధాల పోయింది. అప్పుడను కొన్నాను. భారతిని ఒక్క రోజన్నా చూడకుండా ఉండలేదని, ఆ రోజు తెలుసుకున్నాను. భారతి నా యెదలో ఎంతగా నిలిచిపోయిందో, మనస్సును ఎలాగో సరిపెట్టుకొని ఆ రాత్రి గడిపేను.

రెండవ రోజు కూడ వార్డులో భారతి కన్పించక పోయేసరికి నా మనస్సు విలవిల్లాడిపోయింది. ఇంక ఉండబట్టలేక సంధ్యను అడిగాను. "భారతి క్లాసుకి రావటము లేదెందు కామెకేమన్నా తెలుసా" అని.

"భారతిని నిన్న రాత్రి హాస్పిటల్‌లో చేర్చారని తెలిసి ఇప్పుడే భారతిని చూసివస్తున్నానండి. తనకు జ్వరము ఎక్కువగా వచ్చిందని స్పెషల్ వార్డులో చేర్చారు" అంది సంధ్య.

"థాంక్స్" అని చెప్పి హుటాహుటిని స్పెషల్ వార్డుకు వెళ్ళాను. అక్కడ నీరసంగా పడుకొని వుంది భారతి. భారతి ప్రక్కన ఒకామె కాస్త మాసిన చీరతో నిలబడి వుంది. నేను భారతి బెడ్ దగ్గరకు వెళ్ళగానే భారతి కళ్లు తెరచి నీరసముగా నవ్వింది.

"క్లాసుకు వెళ్ళలేదా" అని అన్నది.

నాకేమి చెప్పాలో అర్ధముకాలేదు. తనని ఆ స్థితిలో చూస్తుంటే నా మనసు అస్తవ్యస్తముగా వుంది. ఎలాగో అన్నాను. "సంధ్య, నీవు హాస్పిటల్‌లో జాయిన్ అయ్యావని ఇప్పుడే చెప్పింది."

తన ప్రక్కన నిలబడిన మనిషిచేత ఒక కుర్చీ నాకు దగ్గర వేయించి కూర్చోమంది.

కూర్చుంటు అన్నాను "ఇప్పుడెలా వుంది. అసలు ఏమిటి కంప్లైంట్" అని.

నవ్వుతూ అంది "పుస్తకము పెన్ను తీసి వ్రాయండి నా కేస్‌షీట్."

అంత నీరసంలో కూడా సరదాగా మాట్లాడడము నాకు కాస్త వింతేననిపించింది.

మళ్ళీ తనే అంది "నిన్నటినుండి జ్వరము, నన్న రాత్రి నూటనాలుగు డిగ్రీలువరకు జ్వరము వస్తే జాయిన్ చేసారు. డాక్టరు ఫ్లూ అంటున్నారు" అని.

"మీ రివాళ క్లాస్‌కు ఫ్రెంచ్ లీవు తీసుకున్నట్లున్నారు."

నీవీ పరిస్థితిలో వుండగా నేను క్లాసుకు వెళ్ళినా వెళ్ళకపోయినా ఒకటే భారతి అని అనాలనిపించింది. కాని పైకి "అవును నీ ఒకర్తివి వంటరిగా వుంటే బోరుగా లేదు" అన్నాను.

"నేను ఒంటరిగా ఎప్పుడు వుండను. రాత్రులు మా అమ్మ వుంటుంది. పగలు ఎవరో ఒకరుంటారు. ఇదిగో ఈమె మా పనిమనిషి" అంది తన ప్రక్కనున్న స్త్రీని చూపిస్తూ.

ఆ పూట పన్నెండు గంటలవరకు భారతి దగ్గరే కూర్చొని వెళ్ళిపోయాను.

ఆ రోజునుంచి ప్రతి సాయంత్రము భారతి వద్దంటున్నా ఏపిల్స్ తీసుకొని వెళ్ళేవాడిని. ఒక రోజు మాటల సందర్భములో అంది భారతి.

"ఈ కాలేజీలో రమారమి సగము మందికన్నా వివాహాలయిపోయాయి కదా, మరి మీ వివాహము మాటేమిటి?"

బహుశా తను నా ఉద్దేశ్యము తెలుసుకోవాలని అలా అడిగివుంటుందని అర్థము చేసుకోగలిగాను. కాని ఉద్దేశ్యాన్ని బయట పెట్టేముందు తనకి నాపై ఎటువంటి అభిప్రాయముందో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యము నాకు కలిగింది. కాని సూటిగా ఎలా అనాలో తెలియక చివరికిలా అన్నాను.

"నాకింతవరకు వివాహము కాలేదు. వివాహము చేసుకోవాలన్న నాలో ఏముందని?" అన్నాను కాస్త దిగులు నటిస్తూ.

"ఛ! ఛ! మీ మీద మీకు సదభిప్రాయము లేదన్న మాట. ఏ స్త్రీ తనకు కావలసిన భర్త అందచందాలను గూర్చే కోరుకోదు. తనభర్త పెద్దహోదాలో ఉండాలని

చదువు, సంస్కారం కలిగి తన కష్టసుఖాల చేదోడు వాదోడుగ వుండి సంసారిక సుఖాలతో సంతృప్తి కలుగ జేసేవాడు కావాలని కోరుకుంటుందే గాని కేవలం అందాన్నే కోరుకుంటారనుకోవడము పొరపాటు.''

''అయినా నాకు తెలియక అడుగుతాను. మీలో ఏం లోపమని?'' అందగాడైనా, కురూపియైనా కోర్కెలు మాత్రము అందరికి సమానముగా వుంటాయి. మీలో అందము ఏమి తక్కువ. మీ మాటలకు ఎంతటి విషాద ములో నున్నవారికైన మనశ్శాంతి ప్రసాదించగల నేర్పుంది. మీకు కావలసినంత ఆస్తి వుంది. దానికి తగ్గ చదువుంది ఇంతకన్నా ఏ స్త్రీ మాత్రమేమి కోరు కుంటుంది చెప్పండి. ఇంకా పురుషులే ఏమన్నా ఎక్కు వగా కోరుకుంటారేమో?'' అంది.

నా గురించి ఇంతగా పొడుగుతున్నంతసేపు నాలో నేను పొంగిపోయాను. అయితే భారతి తప్పకుండా నన్ను ప్రేమిస్తున్నదన్న మాట...ఇలా నాలో ఆ భావన కలగ గానే నా సంతోషాని కవధిలేదు. కాని తమాయించు కొన్నాను. ఆఖరిలో పురుషులే ఇంకేమైనా కోరుకుంటా రేమో అన్నమాటకు నేనెంతయినా సమాధానము చెప్ప వలసి వుంటుంది.

''పురుషులు మాత్రము ఏమి కోరుకుంటారు. తన భార్య మనసార తననే వాంఛించాలని, ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించాలని కోరుకుంటారు. అంత చిన్న కోరిక నాకే మిటి, ప్రతివాడికి ఉంటుంది'' అని అన్నాను.

''నిజమే. భర్త భార్య మనసులో, భార్య భర్త మన సులో ఎల్లప్పుడు నివాస ముండాలనుకోవడము ప్రకృతి సిద్ధం. ఏ స్త్రీ పురుషుని అందము గురించి ప్రాకులాడదు. కాని పురుషుడు అందచందాలను గురించి ఎందుకు ప్రాకు లాడుతాడో నా కర్థము కాలేదు!'' అంది భారతి.

''అది కూడా ప్రకృతి సిద్ధమే నేమో''అన్నాను ఆమె ప్రశ్నకు సరియైన సమాధానము చెప్పలేక.

ఇంతలో ఎవరో ఒకామె వచ్చింది. చాలా హుందాగా వుంది. ఆమె ధరించిన దుస్తులనుబట్టి బాగా ధనవంతులని తెలుస్తుంది.

ఆమె లోపలకు వస్తూనే నన్ను చూసి అడిగింది భారతిని, ఎవరితను అని.

''నా క్లాసుమేట్ ప్రభాకర్'' అంది.

ఆమెను చూపెడుతూ వాళ్ళ అమ్మని చెప్పింది.

వెంటనే లేచి నమస్కరించాను.

ప్రతినమస్కారమైన తరువాత కాసేపు కూర్చొని కాలేజి లెసెన్స్ గురించి మాట్లాడి వచ్చేసాను. భారతి హాస్పెటల్‌లో వున్న రోజులలో ఎక్కువ కాలము తన దగ్గరే వుండేవాడిని.

* • *

నాలుగు రోజులలో భారతి పూర్తిగా కోలుకొని కాలేజికి వచ్చింది.

సాయంత్రము థియర్లీ క్లాసెస్ అయిపోయాక హాస్టల్ బస్‌కని వెళుతుండగా భారతి పిలిచింది.

''ఏమిటి విశేషము.''

''నాకు ఫ్లూ రాకముందు మనము కలిసి వెళ్ళిన 'పియా కాఘర్' పిక్చరేనా ఆఖరి పిక్చర్. ఇవాళ శనివారము కదా. ఫస్ట్‌షోకి 'అందాజ్' పోదామా, లేకపోతే నాకు బోరుగా వుంది'' అంది.

''నాకు అదే లాస్ట్ పిక్చర్ నీకు ఫ్లూ వచ్చిన దగ్గర నుండి నేను పిక్చరుకు పోలేదు. అందాజ్ చాలా మంది బాగుంటుందంటున్నారు. తప్పకుండా వెళదాము'' అన్నాను.

రాత్రి పిక్చరునుండి వయటకు వస్తున్నప్పుడు అడి గేను. ''పిక్చరు ఎలా వుందని.''

(సశేషం)

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులము కాదు.

—సంపాదకుడు.